# క్రైస్తవ నాయకత్వము

బైబిలు గ్రంథములో చాలా సందర్భాలలో నాయకత్వపు బాధ్యతలు స్వీకరించిన వారి ఉదాహరణలు చూడవచ్చును. క్రైస్తవ నాయకత్వము అంటే ఏంటి? మరియు నాయకత్వమునకు అవసరమైన గుణలక్షణములు ఏంటి? ( మత్తయి 5:13 ) యేసు చెప్పెను మీరు లోకమునకు ఉప్పైయున్నారు. ఈ మాటను బట్టి ప్రభువు మన పరిసర ప్రాంతములలో ఒక నాయకునిగా ప్రభావితము చేయుటకు ఇచ్చిన పిలుపు అని గ్రహించవచ్చు.

యేసు తను శిష్యులకు బోధించిన ఉపమానముల ద్వారా క్రైస్తవ నాయకత్వమును గుర్తించి మనము అర్థము చేసుకోవచ్చు. ఈ ఉమానములు శిష్యరికమునకు మరియు నాయకత్వమునకు అవసరమైన గుణలక్షణములపై గమనము కలిగి వున్నవి. ఈ ఉపమానములో యజమానుడునకు - దాసుడునకు, వ్యాపారస్తులకు - రాజులకును, కాపరి - గొర్రెలకును వున్న సంబంధము గురించి యేసు ప్రభు బోధించుచు వచ్చెను. నాయకత్వమును గురించి నేర్చుకొనుటకు సహాయపడే కొన్ని ఉపమానములు:

| | | |
|---|---|---|
| మత్తయి 24:45-51 | యజమానుని సంకల్పము నేరవేర్చుట | పరలోక దర్శనము |
| మత్తయి 25:14-30 | దాసుని తలాంతులు | యజమానుని అభిలాషను అభివృద్ధిపరచుట |
| లూకా 10: 30-37 | మంచి సమరయుడు | జాలిపడుట |
| లూకా 14:28 | వ్యాపారస్తుడు | ప్రణాళిక మరియు లెక్క అప్పగించుట |
| లూకా 14:31 | రాజు | ప్రణాళిక మరియు లెక్క అప్పగించుట |
| యోహాను 10:1-18 | మంచి కాపరి | నడిపించుట, మేపుట, సరిచేయుట, కాపాడుట |

యేసు క్రీస్తు వారి బోధనుండి నాయకత్వపు వ్యూహం గ్రహించిన యెడల, అది ఈ విధముగా వుండవచ్చు

- దర్శనమును అభివృద్ధిపరచుకొనుట
- పని యొక్క ఉద్దేశమును గ్రహించుట ( బృహత్కార్యం )
- దర్శనమును , పని యొక్క ఉద్దేశమును ( బృహత్కార్యం ) తెలియపరచుట
- క్రమముగా పనులను నియమించుట
- మందను కాయుట
  - మందను మేపుట
  - మందను సరిచేయుట
  - మందను కాపాడుట
  - మందను నడిపించుట

మనము కూడా మన క్రైస్తవ జీవితయాత్రలో కొనసాగుతూ, దేవుని యొక్క సంకల్పములు నెరవేర్చుటకుగాను, క్రైస్తవ నాయకులుగా ఎదుగుటకు పిలువబడితిమి. క్రొత్త నిభందన గ్రంథములో పౌలు ఏరీతిగా నాయకుడుగా వ్యవహరించెనో చూడగలము.

**<u>దర్శనమును అభివృద్ధిపరచుకొనుట:</u>**

ప్రతి దేవుని బిడ్డకు దేవుడు ఆత్మ వరములను అనుగ్రహించియున్నాడు. ఈ ఆత్మ వరములతోను మరియు భౌతికమైన జన్మ ద్వారా ప్రభువు మనకు తలాంతులు ఇచ్చెను. వాటితో ఆయన పిల్లలమైన మనము అపవాది తంత్రములను గ్రహించి పోరాడుటకు శక్తిగల్గి క్రైస్తవ నాయకులుగా ఎదగాలని ప్రభువు కోరుచున్నాడు. అపవాదిని మన కాళ్ళ క్రింద త్రొక్కి ( రోమా 16:20 ) అనేకులను దేవుని కొరకు శిష్యులుగా చేయుట అయన రాజ్య వ్యాప్తికి ముఖ్యమైన గమ్యమైయున్నది ( మత్తయి 28:19, 20 ). పెంతికోస్తు దినమున సంఘము ఆరంభమైనది మొదలుకొని ఇదే లక్ష్యమైయున్నది. నాయకులైనవారు ఈ గురిపై గమనము కలిగి వారి భాగమును నిర్వర్తించుటలో మరియు బాధ్యతను సంపూర్ణము చేయుటలో దేవుని సన్నిధిలో కనిపెట్టుకొని యుండుట అవసరమైయున్నది.

యేసు క్రీస్తు ప్రభువు తన మరణ, పునరుద్ధానము ద్వారా మనలను నూతన నిబంధన లోనికి తెచ్చెను. నూతన నిబంధన కాలములో దేవుడు ఏమి చేయబోతున్నాడో ప్రవక్తయైన యోవేలు ద్వారా వాగ్దానము చేసెను (యోవేలు 2:28). దేవుడు తన పిల్లలను ఏరీతిగా నడిపిస్తాడో ఈ వాగ్దానము తెలియచేయుచున్నది. ( యోవేలు 2:28 దేవుడు తన ఆత్మను కుమ్మరించినపుడు వారు ప్రవచించెదరు, వారు కలలు కందురు మరియు వారు దర్శనములు చూతురు ) రాబోయే భవిష్యత్తులో పరిచర్య లేదా సంస్థ స్థానము ఏ స్థాయిలో వుండాలో అనేది గ్రహింపు కలిగియుండుట నాయకునికి ఒక గొప్ప సవాలైయున్నది. నాయకులైనవారు ప్రార్ధనలో దేవుని సన్నిధిలో కనిపెట్టుట

ద్వారా దేవుడే వారికి బయలుపర్చువాడైయున్నాడు ( అపో 13:1 ). భవిష్యత్తును గురించిన సరియైన అవగాహన లేనియెడల, సంస్థలు గతములో జీవించినప్పటికినీ రాబోయే దినములలో తప్పక క్షీణించిపోవును. "ఎక్కడ దర్శనము లేదో అక్కడ ప్రజలు నశించుదురు" ( సామెతలు 29:18 ). ఏ క్రైస్తవ సంస్థకైనా చక్కటి దర్శనము దేవుని యొద్ద నుండే రావలెను. ఈ ప్రక్రియ ప్రార్థన మరియు దేవుడు ఏ రీతిగా ఎప్పుడు ఎలా పని చేస్తున్నాడో, అనే గ్రహింపు మీద ఆధారపడి వున్నది. ఆరీతిగా ఒక సంస్థయైనా, పరిచర్యయైనా, దేవుని యొక్క పిలుపును గూర్చిన గ్రహింపు ద్వారా ఉద్భవిస్తుంది. నాయకుడు తన తోటి పనివారితో ఎక్కువ సమయము ప్రార్థనలో గడుపుట ద్వారా తోటి పని వారి యొక్క మనస్సులు కూడా పరిచర్యకు సిద్ధపడేవిగా వున్నవి ( అపో 1:14 ). ఇటువంటి దర్శనము ద్వారా ఉద్భవించిన సంస్థయైన, పరిచర్యయైన దైవ నియమములతో సరిసమానముగా వుండును. దేవుడు వాక్యము ద్వారా మరియు అనుభవము ద్వారా  మరియు సలహా ఇచ్చుట ద్వారా మరియు అనేకమైన విధానములలో దేవుడు మాట్లాడే వాడై వున్నాడు. వీటన్నిటిని వినుట  ద్వారా దేవుడు నాయకుని, తన తోటి పని వారిని ఏ దిశలో నడిపిస్తున్నాడో దానిని సులభముగా గ్రహించవచ్చు. నాయకుడు ఎల్లప్పుడు దేవుడు తనకు అనుగ్రహించిన నడిపింపును తప్పక తన తోటి పనివారితో పంచుకొనుట అవసరమై వున్నది.

**<u>పని యొక్క ఉద్దేశమును  గ్రహించుట ( బృహత్కార్యం ):</u>**

ఒక సారి దర్శనముచే ఒప్పింపబడిన వారు ముందుకు కొనసాగుటకు ఒక సంకల్పమును కలిగి వుండాలి. ఈ సంకల్పమే ఒక గుంపుకు బృహత్కార్యమై వున్నది. దర్శనమును నేరవేర్చుటకై చేయబడే కొన్ని క్రియలు బృహత్కార్యమై వున్నవి. ఈ ప్రక్రియలో నాయకుడు ప్రాముఖ్యమైన ఆలోచనల నిచ్చుట ద్వారా, సహపని వారందరితో కలిసి ఈ పనిలో ముందుకు కొనసాగే వారై వున్నారు. దీనికి పౌలు మంచి ఉదాహరణ. దమస్కు వెళ్ళే మార్గములో పౌలుకు ఒక దర్శనము కలిగెను ( అపో 26:19) . ఈ దర్శనమును తన మిషనరీ ప్రయాణముల  ద్వారా నేరవేర్పులోనికి తెచ్చెను. దీనంతటిలో ఆత్మ యొక్క నడిపింపు ఎంతో ప్రాముఖ్యమై వున్నది ( అపో 13:2). దర్శనము నేరవేర్చుటలో వచ్చే అడ్డంకుల విషయమై నాయకుడు చక్కటి అవగాహన కలిగి వుండుట ద్వారా, ఈ పని నేరవేర్చుటకు సహాయపడేదిగా వున్నది ( రోమా 15:18-23). దమస్కు మార్గములో తాను పొందిన అనుభవము తరువాత, పౌలు వెంటనే అరేబియాకు వెళ్ళెను. ఆ స్థలములో తాను కచ్చితంగా ఏమి చేసాడో తెలియదు కాని, బహుశా ఈ సమయములోనే పౌలు తనకు కలిగిన ఆ దర్శనము విషయమైన రూపకల్పన, అవగాహన కలిగి వుండవచ్చు. అన్యజనులకు తాను చేయవలసిన పరిచర్య అనే దర్శనమునకు, అనేకమైన సమస్యలు ముడిపడి వుండెను గనుక, వీటిని ప్రత్యేకించుట అవసరమై వున్నది. తాను అన్యజనులకు పరిచర్య చేయుట అవసరమై వున్నయెడల, సున్నతి విషయమై తాను ఎరీతిగా ఆ అన్యజనులకు బోధించవచ్చు? ప్రాముఖ్యముగా తాను ఈ విషయముపై అవగాహనతో కలిగి కచ్చితముగా నిలువబడి అపొస్తులతో( పేతురు) కూడా పోరాడుతూ వచ్చెను (గలతి  2:11-16). తాను అరేబియాలో వున్న కాలములో బహుశా ఇటువంటి విషయములన్నిటిపై తాను చక్కటి అవగాహన పొందెను.

**<u>దర్శనము యొక్క ఉద్దేశమును తెలియ చేయుట:</u>**

దర్శనము యొక్క ఉద్దేశమును దానితో ముడివున్న క్రియలను తెలియచేయుట బహు ప్రాముఖ్యమై వున్నది. పౌలు తన దర్శనము విషయమై ఒక్క సారికంటే ఎక్కువగా ప్రస్తావించుచూ వచ్చెను (గలతి 1:16, 2:7, అపో 22:6-11, 26:12-18, గలతి 1:15-17). తాను అన్యజనులకు పరిచర్య చేయుట కొరకై పిలువబడినాడని రూఢిగా నమ్ముచూ వచ్చెను. పౌలు, దీనిని మాట ద్వారా మరియు రచియించుట ద్వారా స్పష్టముగా తెలియచేసెను.

అన్యజనుల రక్షణ విషయమై వివాదము వచ్చినప్పుడు, పౌలు బర్నబా, తనతో వున్నా కొంతమంది ఈ వివాధమును గూర్చి చర్చించుటకై యెరూషలేముకు వెళ్ళిరి ( అపో 15:2 ). పెద్దలతోను, అపొస్తులులతోను, ఈ విషయము చర్చించిన తరువాత, వారు ఒక నిర్ణయమునకు వచ్చిరి. వీటన్నిటిని బట్టి, దర్శనమును నెరవేర్చుటలో, సమాచారమును అందించుట ఎంతో ప్రాముఖ్యమై వున్నది.

ఈ బృహత్కార్యములో అనేక పనులు అవసరమై యున్నవని పౌలు వ్యక్తపరిచెను. అంతియొకయలో దేవుని వాక్యం కేవలం యూదులకే బోధింపబడెను ( అపో 11:19 ). బర్నబా, సౌలు అంతియొకయలో పరిచర్య చేయుచూ వచ్చిరి ( అపో 11:26 ). ప్రవక్తలు బోధకులైన వారు, ప్రభువును ఆరాదించుచూ ఉపవాసముతో ప్రార్థన చేయుచుండగా, దేవుని యొక్క ఆత్మ, పౌలును బర్నబాను, దేవుడు తమను పిలిచిన ఆ పనికి ప్రత్యేకపరచుడని తెలియచేసెను. (అన్యజనులకు పరిచర్య చేయుట  అపో 13:1,2 ). యూదులకు మాత్రమే బోధించుట అనే పద్ధతినుండి వేరుచేయబడుట ఒక నూతన దర్శనమని నమ్మిరి. పౌలు, బర్నబా తిరిగివచ్చి దేవుడు అన్యజనుల మధ్య ఏరీతిగా ద్వారము తెరచెనో సంఘమునకు తెలియచేసిరి ( అపో 14:27 ). ఈ విధముగా దర్శనము మరియు ఉద్దేశమును

సంఘము ద్వారా ఆమోదించబడును.

**<u>క్రమముగా పనులను నియమించుట:</u>**

అన్యజనులకు సువార్త ప్రకటించుటకు పౌలు పిలువ బడినపుడు ఏ స్థలము దర్శించ వలెనో, తను ప్రభువు యొద్ద నుండి నడిపింపు కోరుచు వచ్చెను. పౌలు మూడు మిషనరీ ప్రయాణములు చేసెను. అయన పరిచర్య యొక్క వివరములు ఏమనగా

| | |
|---|---|
| • సిద్ధపాటు | గలతి 1: 1517 |
| • సంఘ నాయకత్వముతో ఐక్యపరచుకొనుట | గలతి 1: 18 |
| • ప్రజలు మరియు స్థలము | రోమ 15:19b |
| • వారు ఏమి నేర్చుకొన్నారో పరీక్షించుట | అపో 19:1-7, గలతి 1:6 |
| • వారి యొక్క ఎదుగుదలను పరీక్షించుట | అపో 15:36, 1 కొరింధీ 1:11, 2 కొరింధీ 1 :15,16, కొలస్సి 1:3, 1 థెస్స 1:3 |
| • పత్రికల ద్వారా సహవాసమును పురికొల్పుట | కొరింధీ, గలతి, ఎఫెసి, కొలస్సి మరియు థెస్సలోనికయులకు |
| • తిరిగి సమకూర్చుకు పని చేయుట | ఫిలోమోను |
| • బృందముతో పని చేయుట | ఫిలిప్పి 2:3, 2 తిమోతి 4:19,21, కొలస్సి 4: 10:12, రోమా 16:3,9, 21-23 |
| • భవిష్యత్తులో వచ్చే సమస్యల గురించి హెచ్చరిక | అపో 20:28-31 |

పౌలు సువార్తను అన్యజనులకు భోదించుటకు, వారిని ఏయె పట్టణములలో కలవవలెనో అ ప్రణాళికను పౌలు జాగ్రత్తగా సిద్ధపరచుకొనెను. తన మూడు మిషనరీ ప్రయాణములలో అన్యజనులు నివసించు స్థలములన్నిటిలో సువార్త ప్రకటించెను. యెరూషలేము మొదలుకొని ఇల్లురికు వరకు వున్న పట్టణములన్నింటిలో సువార్తను ప్రకటించెను. తన పరిచర్య ద్వారా స్థాపించబడిన సంఘముల యొక్క ఎదుగుదలను పరీక్షించుటకు తన మూడు మిషనరీ ప్రయాణములు సహాయపడెను

**<u>మందను కాయుట</u>**

**మందను మేపుట**

తన నామము ద్వారా పిలువబడిన ప్రజలందరినీ యేసు గొర్రెలని సంభోదించెను. జంతువులన్నింటిలో గొర్రె బహు తెలివితక్కువదిగా ఎంచబడెను, కుక్క వలె తెలివి కలిగినది కాక, బహు సులబముగా గురి తప్పి, భయపడి, ఏమియు తోచక మందకు తిరిగి వెళ్ళు మార్గమును కనుగొనుటలో సామర్ధ్యము లేనిదై వున్నది. కాపరి లేని గొర్రెలవలె నిస్సహాయమైన స్థితిని తెలియజేయుటకు యేసు "తప్పిపోయిన గొర్రె" ఉపమానమును భోదించెను.

ఒక క్రైస్తవ నాయకుడు మందను మేపువాడై యుండవలెను. మందను మేపుటకు దేవుడు తన వాక్యమును అనుగ్రహించెను. దేవుని వాక్యమును భోదించుట మరియు వాక్య గ్రహింపు లోనికి నడిపించుట, ఒక క్రైస్తవ నాయకుని ప్రాముఖ్యమైన పనియై వున్నది. ( ద్వితీ 8:3 ) "ఆహారమువలననే గాక యెహోవా సెలవిచ్చిన ప్రతిమాటవలన నరులు బ్రతుకుదురని".

**మందను సరిచేయుట**

తప్పిపోయిన గొర్రెను తిరిగి మందలోనికి తీసుకొనివచ్చుట కాపరి పనియైయున్నది. మరొక్క మాటలో తప్పిపోయిన గొర్రెను సరిచేసి క్రమశిక్షణలోనికి తెచ్చుట. ఇటువంటి క్రమశిక్షణ ఆత్మ సభంధమైన నియమములతో చేయవలెను. ( సామెతలు 3:12 ) ' యెహోవా తాను ప్రేమించువారిని గద్దించును '. అవసరమైనప్పుడు సరిచేసి క్రమశిక్షణ చేయుటకు ఒక క్రైస్తవ నాయకునికి మంచి లక్షణమైయున్నది. ఆ క్రమశిక్షనంతయు దేవుడు బయలుపరచిన వాక్యపు నియమములపై ఆధారపడియుండవలెను.

**మందను కాపాడుట**

యేసు తనను వెంబడించు వారిని గురించి మాటలాడుచు ఈ రీతిగా అనెను. అబద్ద బోధకులుగాను

మరియు అబద్ధ ప్రవక్తలుగాను, అపవాది మోసగించుటకు అంధకార సంబంధమైన అధికారముతో ఐక్యపరచుకొనుచున్నాడు. తప్పుడు సిద్ధాంతములతో మరియు దేవుని వాక్యము యొక్క అధికారమును ప్రశ్నించుచు తప్పుడు బోధతో గొర్రెలను మోసగించు శత్రువులైయున్నారు ( 2 తిమోతి 3 : 1 - 9, అపో 20 : 28 - 32). మత్తయి 7 :15 లో యేసు చెప్పెను - వారు గొర్రెల చర్మములు వేసుకొని మీయొద్దకు వత్తురు కానీ, వారు లోపల క్రూరమైన తోడేళ్లు.

**మందను నడిపించుట**

దేవుని మార్గములో మందను నడిపించుట కాపరి యొక్క ముఖ్యమైన పనియైయున్నది. బైబిలు గ్రంథములో గొర్రెలను ఏరీతిగా ప్రభువు నడిపించునో బహు స్పష్టముగా ఉన్నది. గొర్రెలకు వాటి యజమానుని స్వరము వినుటయును, గ్రహించుకొనుటకును, ఆయన అడుగుజాడలలో నడచుటను భోధించవలసిన భాద్యత నాయకునిపైయున్నది ( 1 పేతురు 5: 2 - 4 ).

## నెహెమ్యా నుండి ధ్యానము

**నేపధ్యం:**

నెహెమ్యా 1 : 11b - నేను రాజుకు గిన్నె అందించువాడనైయుంటిని.

నెహెమ్యా చెరలోనుండి వచ్చినప్పటికిని తను ప్రయాస పడి, రాజు సముఖమున నిలువుటకు హెచ్చించబడి, రాజుకు గిన్నె అందించువాడుగా చేయబడెను. గవర్నర్ కు సమానమైనదిగా ఈ స్థానము వున్నది. రాజు భవనములో వుండుట ద్వారా రాజ్యమును ఏలు విషయములో నాయకత్వపు వ్యూహములను నేర్చుకొని యుండవచ్చు.

**తన కోరిక , దర్శనము:**

1 : 1,2 దేవుని రాజ్యము గురించి , దేవుని పట్టణము అని అనబడిన యెరూషలేము గురించి మరియు దేవుని ప్రజల గురించి పట్టింపు కలిగి యుండెను.

1 : 4 పరిస్థితికి పరిష్కారము వెదికెను. దేవుని యొక్క నడిపింపు కోరెను.

1 : 5-10 దేవుని వాక్య వెలుగులో పరిస్థితిని అర్ధముచేసుకొనెను
యెరూషలేము ప్రాకారము కట్టుట తన దర్శనము ఆయెను.

**ప్రార్ధన , ప్రణాళిక**

1 : 11 ఏమి చేయవలెనో నిర్ణయించెను

2 : 5 తిరిగి వెళ్లి యూదాను కట్టుటకు రాజు అనుమతిని కోరుట
తాను ఏమి చేయవలెనో ముందుగా నిర్ణయించుకొనెను.
యెరూషలేముకు వెళ్ళుట
యెరూషలేము ప్రకారము కట్టుట
యెరూషలేములో యూదుల అధికారమును స్థాపించుట
తరువాత యూదయకు వెళ్ళుట
తన ముఖ్య ప్రణాళిక యూదా , అత్యవసర ప్రణాళిక యెరూషలేము
అధికారులనుండి అనుమతిపొందుట
రాజు నొద్దనుండి అనుమతి

**పనియొక్క ఉద్దేశమును గ్రహించుట**

2 : 11 తానే పనిచేయు స్థలమునకు వెళ్ళుట
తాను ఈ సంగతి ఎవరికీ అప్పగించలేదు - ( పరిణితి చెందిన మనస్సు )

2 :12-16 పరిస్థితిని గ్రహించి పనిని అంచనావేసెను

**తోటిపనివారిని సమకూర్చుట**

2 : 16 పనిచేయు బృందమును సమకూర్చెను

2 : 17 తనకున్న దర్శనమును పంచుకొనెను
మనము ఇక శ్రమపడకుండునట్లు రండి కట్టుదము.
దేవుడు తనకు సహాయము చేసిన సాక్ష్యము పంచుకొనెను

2 : 18 బృందము ప్రాకారమును కట్టుటకు సిద్ధపడిరి

**<u>పని : ప్రాకారమును కట్టుట</u>**

3 :1-32 పని అందరికి సమానముగా పంచబడుట
ప్రతివాడు వాని భాగమును నిర్వర్తించుట

**<u>మందను కాపాడుట</u>**

4 :1-3 వ్యతిరేకత
4 :4-5 ప్రార్ధన ద్వారా వ్యతిరేకతను ఎదురుకొనుట
4 :7-8 వ్యతిరేకత అధికమవుట
4 :9-23 వ్యతిరేకతలో పనిని కొనసాగించుటకు ప్రార్ధన మరియు క్రొత్త వ్యూహము

**<u>మందను సరిచేయుట</u>**

5 :1-5 దేవుని ప్రజల మద్య సమస్యలు
5 :6-13 నెహెమ్యా వాటిని సరిచేయుట
9 :1-38 ప్రజలు ఒప్పుకొనుట
13:1-31 నెహెమ్యా కట్టడలను మెరుగుపర్చుట

**<u>మంద విషయమై పట్టింపు</u>**

5 :14-19 ప్రజల విషయమై, వారి కార్యముల విషయమై నెహెమ్యా పట్టింపు

**<u>మందను మేపుట</u>**

8 : 1-8 దేవుని వాక్యమును బోధించుటకు సమాజమును సిద్ధపరచుట

**<u>ముగింపు</u>**

దేవుడు తన సంకల్పమును నెరవేర్చుటకు, తన ప్రజలైన వారిని నడిపించి కాపాడుటకు పురుషులను ( మోషే, యెహోషువ ) స్త్రీలను ( దెబోరా, ఎస్తేరు ) నాయకులుగా వాడుకొనెను. ఈ పరిస్థితులన్నింటిలో పని అంతటిని నాయకుడు మాత్రమే సంపూర్ణము చేయలేదు. ఒక్కొక్క మెట్టులో అనేక నాయకులను మనము చూడవచ్చు ( నిర్గమా 18 : 21 – 23, ద్వితీ 1 : 9 – 18 ). వాస్తవానికి ఒకానొక సమయములో అందరూ నాయకుని పని చేయవచ్చు. కొన్నిమార్లు బాధ్యత పెద్దదిగా లేదా చిన్నదిగా వుండవచ్చు. దేవుని ప్రేమను రుచిచూచి, అయన పిలుపుకు ప్రతిస్పందించిన వారు నాయకత్వము స్థానము కొరకు సిద్దపడవలసి ఉన్నది.